సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



వెలుగుల మాటున ప్రమాదం

దీపావళి పండుగ రోజున ప్రతి ఒక్కరూ ఆనందంగా బాణాసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

IIలో



... ఆర్థికాభివృద్ధి సాధించాలి

మత్స్య సొసైటీలకు పంపిణీ చేస్తున్న చేప పిల్లల ద్వారా ఆర్థికాభివృద్ధి చెందాలని మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ అన్నారు.

IIలో



వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగినా.. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భ గుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్ర కూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్‌ఎం



డీఎం, సిబ్బందితో మాట్లాడుతున్న సరిరామ్

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపోను ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ శనివారం సందర్శించారు. డిపో గ్యారేజీలో బస్సుల నిర్వహణపై మెకానిక్‌లను అడిగి తెలుసుకున్నారు. బుకింగ్ చార్ట్ దగ్గర డ్రైవర్లు, కండక్టర్ల కేటాయింపు, ఎర్నింగ్ సెక్షన్, టిమ్స్ వంటి వివరాలపై డీఎంతో చర్చించారు. డిపోలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే సిబ్బంది అందరూ కష్టపడి పని చేయాలని సూచించారు. బస్టాండ్‌తో పాటు డిపో ఆవరణలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దసరా సందర్భంగా డిపోకు ఎక్కువ ఆదాయాన్ని తెచ్చినందుకు సిబ్బందిని ప్రశంసించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాసరావు, కొత్తగూడెం డిపో మేనేజర్ మలగం దేవేందర్ గౌడ్ ఉన్నారు.

'చెకుముకి' వాల్‌పోసర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: చెకుముకి సైన్స్ సంబురాల వాల్‌పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంపొందించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెకుముకి పరీక్షలను 33 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నమని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు వీరభద్రం, ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.

పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కొన్నేళ్లుగా ఈ రెండు పట్టణాల్లో నెమ్మదిగా నడుస్తున్న అభివృద్ధి బండి.. గేరు మార్చేందుకు అవకాశం ఉంది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



కొత్తగూడెం పట్టణ వ్యూ

కుడా.. అభివృద్ధికి అండ

కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి గ్రీన్ సిగ్నల్

- దశాబ్ద కాలంగా రెండు పట్టణాల్లో నెమ్మదించిన అభివృద్ధి
- కుడా ఏర్పాటుతో ఉమ్మడి ప్రయోజనాలకు ప్రత్యేక ప్రణాళిక

సరికొత్త ప్రణాళికకు అవకాశం..

2011 జనాభా లెక్కల ప్రకారం కొత్తగూడెంలో 79 వేలు, పాల్వంచలో 81 వేల మంది ఉన్నారు. ఈ రెండు మున్సిపాటీలు వేటికవే అన్నట్టుగా ఉండడంతో సమీకృత అభివృద్ధి జరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే నిధులు సైతం వేర్వేరుగా ఉండడంతో ప్రతీసారి రోడ్లు, డ్రెయినేజీలు, సెంట్రల్ లైటింగ్, మరమ్మతులు వంటి రొటీన్ పనులే జరుగుతున్నాయి. ఈ రెండు పట్టణాలను ఒక గొడుకు కిందకు తీసుకొస్తే నిధుల కేటాయింపు పెరుగుతుంది. రెండు పట్టణాల్లో నివసించే ప్రజల ఉమ్మడి అవసరాల ఆధారంగా సరికొత్త ప్రణాళికలు అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది.

సరైన ఫంక్షన్ హాళ్లే లేవు..

కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో భారీగా ఫంక్షన్ల నిర్వహణకు ప్రభుత్వ పరంగా సరైన వసతులు లేవు. దీంతో ఈ రెండు పట్టణాలకు చెందిన చాలా మంది వివిధ శుభకార్యాల కోసం పెద్దమ్మ గుడి దగ్గరున్న ఫంక్షన్ హాళ్లపైనే ఆధారపడుతున్నారు. ఇక కొత్తగూడెంలో చిన్న, పెద్ద బజార్లు, ఎంజీ రోడ్డు, పాల్వంచలోని శాస్త్రి రోడ్డులో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. దీని పరిష్కారానికి ఇప్పటి వరకు రెండు మున్సిపాలిటీల వద్ద సరైన ప్రణాళిక లేదు. ఈ రెండు పట్టణాల మధ్య అనుసంధానంగా కలెక్టరేట్, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఉన్నా.. వాటి తాలూకు మెరుపులేవీ అక్కడ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) లాంటి సంస్థ సరైన రీతిలో ప్రణాళికలు అమల్లోకి తెస్తే జిల్లా కేంద్రం అనతికాలంలోనే గత వైభవాన్ని అందుకునే అవకాశం ఉంది.

ఉమ్మడి ప్రయోజనాలు..

కొత్తగూడెం పట్టణం చుట్టూ చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలో పలు గ్రామాలు ఉన్నాయి. అయితే ఇక్కడ ప్రైవేట్ రంగంలో ధారాళంగా పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. అదే విధంగా పాల్వంచ, కొత్తగూడెం మధ్య రిజర్వ్ ఫారెస్టు ఉండడంతో అక్కడా అభివృద్ధికి బ్రేక్‌లు పడుతున్నాయి. అభివృద్ధే లక్ష్యంగా ఉండే కుడా లాంటి సంస్థలు ఏర్పాటైతే రెండు పట్టణాల పరిధిలో నిబంధనల అడ్డంకి లేకుండా అభివృద్ధికి ఆస్కారం ఉన్న స్థలాల గుర్తింపు, ఆయా స్థలాల మధ్య కనెక్టివిటీ పెంచేలా కొత్త రోడ్ల రూపకల్పన వంటి పనులు చేపట్టే ఆస్కారం ఉంటుంది. సొంతంగా 'రియల్' వెంచర్లు వేయడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఇలా వచ్చే ఆదాయాన్ని రెండు పట్టణాల ఉమ్మడి ప్రయోజనాల కోసం ఖర్చు పెట్టుకునే వీలుంటుంది. అంతేకాక అవకాశం ఉన్న చోట పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్‌లో ప్రాజెక్టులు చేపట్టే వెసులుబాటు కలుగుతుంది. 2016లో జిల్లాల విభజన తర్వాత అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా ఆచరణలో అడుగు ముందుకు పడలేదు. ఎట్టకేలకు జిల్లా కేంద్రంగా ఏర్పడిన ఎనిమిదేళ్లకు 'కుడా' ఏర్పాటైంది. ఇక మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు పనులే మిగిలి ఉన్నాయి.

కుడా ఏర్పాటుతో..

కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుతో జిల్లా కేంద్రంలో భాగంగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందనే అంచనాలు ఊపందుకుంటున్నాయి. దాదాపు 40 ఏళ్ల క్రితమే కొత్తగూడెం, పాల్వంచ పూర్తి స్థాయి పట్టణాలుగా రూపాంతరం చెందాయి. అయితే గడిచిన రెండు దశాబ్దాలుగా ఈ రెండు పట్టణాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. మరోవైపు కొత్తగూడెంలో కొన్ని సింగరేణి గనులు మూతపడగా, పాల్వంచలో స్పాంజ్ ఐరన్, ఏపీ స్టీల్స్ వంటి పరిశ్రమలతో పాటు కేటీపీఎస్‌లో ఓఅండ్‌ఎం కర్మాగారంలో సేవలు నిలిచిపోయాయి. దీంతో ఈ రెండు పట్టణాలు తిరోగమన దశలో పయనిస్తున్నాయి. 2016లో భద్రాద్రి జిల్లా కేంద్రంగా మారడం మినహా చెప్పుకోదగిన ప్రగతి ఏమీ లేదు. అయితే తాజాగా కుడా ఏర్పాటుతో ఈ పరిస్థితిలో మార్పు వచ్చేందుకు ఆస్కారం ఉంది.

మారుమూల ప్రాంతాలకూ 4జీ సేవలు

బీఎస్‌ఎన్‌ఎల్ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జ్ తారాచంద్



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన తారాచంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్, 4జీ సేవలు అందించాలని బీఎస్‌ఎన్‌ఎల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇన్‌చార్జ్ ఎస్. తారాచంద్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఆయన కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో సెల్, ఇంటర్నెట్ సేవలు చాలా అవసరమని, వినియోగదారులు ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రాధాన్యతను బట్టి టవర్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోనూ బీఎస్‌ఎన్‌ఎల్ ఇంటర్‌నెట్, 4జీ మొబైల్ సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో కృషి చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు ఇంటర్నెట్, 4జీ మొబైల్ సేవలు అందించడంలో తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా పంచాయతీ, ప్లానింగ్ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటు సమయంలో రేడియేషన్ గురించి వీడియోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో సీపీఓ సంజీవరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఎన్‌ఐసీడీఐజీ సుశీల్‌కుమార్, బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం శ్రీనివాస్, ఏజీఎం సుధీర్, ఎస్‌డీఈ సక్రునాయక్, అధికారులు షకీల్, బాలాజీ, ఉదయ్, శివరాంజీ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ 2024 ద్వారా నూతనంగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వర్తించి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కొత్త ఉపాధ్యాయులతో స్థానిక డైట్ కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పిల్లలకు అవసరమైన సదుపాయాల కల్పన బాధ్యతను అధికారులు తీసుకుంటారని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. పాఠశాల నిర్వహణ, యూడైస్ పోర్టల్, సమగ్ర శిక్ష, క్వాలిటీ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై విద్యాశాఖకు చెందిన అధికారులు డాక్టర్ ప్రభుదయాళ్, ఎస్.సతీష్ కుమార్, ఎస్.కె సైదులు, ఎ.నాగరాజశేఖర్, ఎస్ శ్రీనివాస్ వివరించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి మాట్లాడి నూతన ఉపాధ్యాయులంతా విద్యార్థుల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు.

పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కలెక్టర్ జితేష్. వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంరూరల్: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని, పోలీసుల వల్లే ప్రజలు సురక్షితంగా ఉంటున్నారని కలెక్టర్ జితేష్ వి పాటిల్, అన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం సెంట్రల్ పార్క్, నుంచి రుంద్రపూర్ వరకు శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించగా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలందిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడేది పోలీస్ శాఖ మాత్రమేనని అన్నారు. దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ ఉగ్రవాదులు, విద్రోహ శక్తుల నుంచి ప్రజలను కాపాడుతూ ఎంతోమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ రక్తం గడ్డ కట్టే చలిలో దురాక్రమణలను అడ్డుకుని దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరులను ఎప్పటికీ మరవకూడదన్నారు. వారిని స్మరించుకుంటూ ఈనెల 21 నుంచి 31 వరకు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. సైకిల్ ర్యాలీలో ఓఎస్డీ సాయిమనోహర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, శ్రీనివాస్, చుంచుపల్లి, 1, 2, 3 టౌన్, జూలూరుపాడు సీఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐలు రవి, సుధాకర్, కృష్ణారావు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోండి..

ఇల్లెందు: నేటి హైటెక్ యుగానికి అనుగుణంగా పోలీసుల్లోనూ మార్పు రావాలని, కొత్తగా ఉద్యోగంలోకి వస్తున్న వారిలో ఎక్కువ మంది గ్రాడ్యుయేట్లే ఉంటున్నారని, వారంతా కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్పీ బి.రోహిత్‌రాజు అన్నారు. శనివారం ఆయన ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసుల రూల్ కాల్ పరిశీలించి, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్, వైట్ కాలర్ నేరాలు పెరుగుతున్నాయని, ఈ కేసులను ఛేదించాలంటే ప్రతీ ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని అన్నారు. విధుల పట్ల చిత్తశుద్ధి, అంకిత భావం కలిగి ఉండాలన్నారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు నాగుల్ మీరా, బి.సూర్య పాల్గొన్నారు.

గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి కృషి

ఐటీడీఏ పీఓ రాహుల్

దుమ్ముగూడెం : గిరిజన విద్యార్థులు చదువులో ముందుండేలా అనేక చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. మండలంలోని పాత నారాయణరావుపేటలో బడీడు పిల్లలు 30 మంది ఉన్నారని, తమకు సమీపంలో పాఠశాల లేక పిల్లలు చదువుకు దూరమతున్నారని ఇటీవల గ్రామస్తులు పీఓను కలిసి విన్నవించారు. దీంతో ఆయన వెంటనే రూ.4.50 లక్షల ఐటీడీఏ నిధులు మంజూరు చేయగా, రేకులతో నిర్మించిన పాఠశాలను శనివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి అందజేశారు. నారాయణరావుపేట ఆశ్రమ పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై ఇక్కడికి కేటాయించారు. అనంతరం మాట్లాడుతూ.. పిల్లలు చిన్నప్పటి నుంచే కోయ బాష నేర్చుకునేలా అవగాహన కల్పించాలని, భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను తప్పక తెలియజేయాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం బొజ్జగుప్పలో పాత కాలపు మట్టి ఇంటిని పరిశీలించి, ఇలాంటి ఇంటిని భద్రాచలంలోని ట్రైబల్ మ్యూజియంలో నిర్మించాలని మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామికి సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, డీఈ హరీష్, ఏఈ రవి, నారాయణరావు పేట పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి నోట్‌పుస్తకాలు అందజేస్తున్న పీఓ రాహుల్

బ్యాంక్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

భద్రాచలం: వివిధ బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆదివారం వరకు దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక ఉంటుందని పీఓ తెలిపారు.

పీఓను కలిసిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం కలిశారు. మణుగూరు, అశ్వాపురం, గుండాల, బూర్గంపాడు మండలాల్లోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అశ్వాపురంలో పోడు భూమి, త్రీ ఫేస్ విద్యుత్, మణుగూరులో నిలిచిన ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల డార్మెటరీ రూం, బూర్గంపాడు ఎస్టీ కాలనీ రోడ్డు, అంగన్‌వాడీ సెంటర్ తదితర సమస్యలు వివరించారు.

ఇంటి వద్దకే ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు



ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యాన లాజిస్టిక్ ద్వారా ఇంటి వద్దకే పార్సిళ్లు చేరవేయనున్నట్లు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ఏటీఎం పవన్‌కుమార్ తెలిపారు. వినియోగదారుల పార్సిళ్లను వేగంగా, భద్రంగా చేరవేస్తుండగా, నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. తొలిదశలో హైదరాబాద్‌లోని ఎంపిక చేసిన 31 ప్రాంతాల్లో ఇంటి వద్దకే పార్సిళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. బుక్ చేసే సమయాన పూర్తి చిరునామా, పిన్‌కోడ్ తెలియజేస్తూ హోం బుకింగ్‌గా నమోదు చేయాలని వివరించారు. హైదరాబాద్‌లో అమలు చేయనున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేయాలని ఆలోచన కూడా ఉందని తెలిపారు.

వేధింపులపై విజిలెన్స్ ఆరా ?

పాల్వంచ: పాల్వంచలోని జెన్‌కో ట్రెనింగ్ సెంటర్‌లో ఓ అధికారి మహిళా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్న విషయమై విజిలెన్స్ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఇటీవల సదరు అధికారి తీరుపై మహిళా ఉద్యోగులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నేతలు సీఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం కలకలం రేపడంతో విజిలెన్స్ అధికారులు సైతం రంగంలోకి దిగారు. ముగ్గురు అధికారులు శనివారం ట్రెనింగ్ సెంటర్‌కు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడి మహిళా ఉద్యోగులతో మాట్లాడారు. ఇటీవలి పరిణామాలు, సదరు అధికారి వైఖరిపై ఆరా తీశారు. ఆ అధికారి గతంలో పనిచేసిన చోట కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై సీఈ శ్రీనివాస బాబు, విజిలెన్స్ డీఎస్పీ రమేష్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఆర్థిక సంఘం నిధులొచ్చాయ్...

- కేఎంసీతో పాటు మున్సిపాలిటీలకు మంజూరు
- పారిశుద్ధ్య నిర్వహణతో పాటు అభివృద్ధి పనులకు కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: నిధులు లేమితో అల్లాడుతున్న మున్సిపాలిటీలకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్థానికంగా సమకూరుతున్న ఆదాయంతో పరిపాలన కూడా కష్టమైన తరుణాన 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి నిధులను మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలోని మణుగూరు మున్సిపాలిటీ మినహా ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులకు..

ఆర్థిక సంఘం నుండి మంజూరైన నిధులను కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులకు వినియోగించుకునే వీలుంది.



పారిశుద్ధ్య వాహనాల కొనుగోలు, అద్దె చెల్లింపు, ఇతర పనుల నిర్వహణ, పచ్చదనం పెంపు, వైకుంఠధామాల నిర్మాణం, నిర్వహణకు, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి నిధులు ఉపయోగించే వెసులుబాటు కల్పించారు. ఈ నిధులతో మున్సిపాలిటీల్లోని కొన్ని సమస్యలకు పరిష్కారం లభించనుంది.

కేఎంసీకి హెల్త్ గ్రాంట్ కూడా....

15వ ఆర్థిక సంఘం నుంచి అన్‌టైడ్ నిధులతోపాటు హెల్త్ గ్రాంట్‌ను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో భాగంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.1.43 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను నగరంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి వినియోగించుకోవచ్చు. అటు అన్‌టైడ్ నిధుల తోపాటు అర్బన్ హెల్త్ గ్రాంట్ ఒకేసారి విడుదల కావడంతో కేఎంసీ ఖాతాలో రూ.3,81,80,114 జమ అయ్యాయి.

కార్పొరేషన్, మున్సిపాలిటీల వారీగా మంజూరైన ఆర్థిక సంఘం నిధులు

కార్పొరేషన్ / మున్సిపాలిటీలు	మంజూరైన నిధులు (రూ.ల్లో)
ఖమ్మం కార్పొరేషన్	2,38,80,114
మధిర	29,30,789
సత్తుపల్లి	28,52,475
వైరా	28,66,414
కొత్తగూడెం	65,33,439
పాల్వంచ	71,52,449
ఇల్లెందు	28,02,490

బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి

- ఉపాధి హామీ ప్రజావేదిక సభలో ఏడీఆర్‌డీఓ రవి

టేకులపల్లి: ప్రతీ ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అడిషినల్ డీఆర్‌డీఓ రవి అన్నారు. టేకులపల్లిలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు. ఈజీఎస్ నిబంధనలపై అవగాహన లేకుండా ఎలా పని చేస్తున్నారంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 36 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన 557 పనులకు సంబంధించి కూలీలకు రూ. 4.60 కోట్లు, సామగ్రికి రూ.24.47 లక్షలు ఖర్చు చేయగా.. ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, లోపాలు తదితర వివరాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏడీఆర్‌డీఓ మాట్లాడుతూ.. ఈజీఎస్ పనుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, మూడు విడతల్లో ఫొటోలు జత చేయాలని, మస్టర్లలో కొట్టివేతలు లేకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కూలీల సంతకాలు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలన్నారు. కార్యదర్శులు గ్రామ పంచాయతీల్లో ఏడు రకాల రిజిస్టర్లు అమలు చేయాలని సూచించారు. ఎక్కువ వేతనాలు చెల్లించడం, ఒకరికి బదులు ఇంకొకరు పని చేయడం, కొలతల్లో తేడాలు తదితర లోపాల కారణంగా పలువురు సిబ్బంది నుంచి రూ.24,096 రికవరీ చేయగా, రికార్డులు సరిగా నిర్వహించకపోవడం, జాబ్ కార్డులు ఇవ్వకపోవడం తదితర కారణాలతో సిబ్బందికి రూ.22,500 జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్‌టీపీ సాయి జ్ఞానేందర్, జిల్లా విజిలెన్స్ అధికారి రమణ, ఎంపీడీఓ రవీంద్రరావు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అనూష, అంబుడ్స్‌మెన్ ప్రకాష్, క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రకాష్, ఎంపీఓ గాంధీ, ఎస్ఆర్పీ రమేష్, ఏపీఓ కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మత్స్యశాఖ జిల్లా అధికారి ఇంతియాజ్



చేపపిల్లల పంపిణీని ప్రారంభిస్తున్న మత్స్యశాఖ జిల్లా అధికారి ఇంతియాజ్

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలను పెంచుకుని మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని మత్స్యశాఖ జిల్లా అధికారి మహ్మద్ ఇంతియాజ్ సూచించారు. మండలంలోని మత్స్య సొసైటీలకు శనివారం ఆయన చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 89 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంపిణీ ప్రక్రియ నవంబర్ 15 తేదీ వరకు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ షబ్నా, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ

దమ్మపేట: మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు చెందిన సొసైటీలకు మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ శనివారం 2,82,750 చేపపిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ రవీందర్ రెడ్డి, ఎంపీఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులతో సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సింగరేణి పర్సనల్ జీఎం సామ్యేల్ సుధాకర్ సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జీఎం చాంబర్‌లో శనివారం రోవర్స్ అండ్ రేంజర్స్‌కు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోవర్స్ అండ్ రేంజర్స్ జాతీయస్థాయిలో అవార్డులు పొందేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తోడ్పాటునందించేందుకు సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ రోవర్స్ అండ్ రేంజర్స్‌కు యూనిఫామ్ అందజేశామని తెలి పారు. ఈ కార్యక్రమంలో అధికారులు జి.రాజేంద్రప్రసాద్, ముకుంద సత్యనారాయణ, జీకే కిరణ్‌కుమార్, టి.శ్రీనివాస్‌రావు, వరప్రసాద్ రావు, పాసినెట్, వెంకటస్వామి, ఎల్.గోపాలకృష్ణ, పి.రామస్వామి, కేవీ ప్రసాద్, ఎం.కొమరయ్య, ప్రిన్సిపాల్ రవి పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధి కోసం గెలిపించండి



తల్లాడ: అన్నారుగూడెం పాఠశాలలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఏన్కూరు/తల్లాడ: ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం గత ఐదున్నరేళ్లుగా కృషి చేస్తున్న తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోమారు గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఈమేరకు ఉపాధ్యాయులంతా ఓటర్లుగా నమోదు చేసుకుని తనను మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఏన్కూరు, తల్లాడ మండలాల్లోని పలు పాఠశాలలను శనివారం సందర్శించిన ఆయన ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించి మాట్లాడారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావుతో పాటు డీ.ఎస్.నాగేశ్వరావు, రాంచంద్, శ్రీదేవి, షేక్ లాల్ సయ్యద్, తాళ్లూరు శ్రీనువాసరావు, శారదాదేవి, రామకృష్ణ, శ్రీదేవి, సంపత్‌కుమార్, సైదులు, మురళీకృష్ణ, ఇందు ప్రియ, స్వరాజ్యలక్ష్మి, సుధాకర్, రామారావు, రత్నకుమారి పాల్గొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం

పాల్వంచ: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. పట్టణ పరిధిలోని కుంటినాగులగూడెం సమీపంలో ఇసుక డంప్ చేయడంతో సమాచారం అందుకున్న పట్టణ, రూరల్ ఆర్ఐలు రవి, హచ్యా వెళ్లి తనిఖీ చేశారు. నిల్వ చేసిన ఇసుకను లారీలో తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇసుక అక్రమ నిల్వలు చేసి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రవి తెలిపారు. నటరాజ్ సెంటర్ ఏరియాలో ఇసుక అక్రమంగా అమ్మకాలు చేస్తున్న షాపుల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

వెలుగుల మాటున ప్రమాదం

చిన్నాపెద్ద తేడా లేకుండా ఆనందోత్సాహాలతో గడిపే దీపావళి పండుగను ఈ నెల 31న జరుపుకోనున్నారు. ఆ రోజు బాణాసంచా కాలుస్తూ ఆనంద డోలికల్లో ఓలలాడుతారు. అయితే ఆ వెలుగుల మాటున ప్రమాదం పొంచి ఉంటుంది. టపాసులు కాల్చే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

–భద్రాచలంఅర్బన్/ఇల్లెందురూరల్

- బాణాసంచా కాలుస్తున్నప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు



భద్రాచలంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన టపాసులు

అధికారులు పర్యవేక్షించాలి

భద్రాచలం పట్టణంలోని ఓ కాలనీలో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన రూ.4 లక్షల విలువైన బాణసంచాను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తరహాలు దాడులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. దీపావళి పండుగ రావడంతో జిల్లావ్యాప్తంగా టపాసుల వ్యాపారం మొదలు కానుంది. ప్రతి ఏటా వ్యాపారులు అనుమతి పత్రాలు, విక్రయించే సమయంలో తెల్లటి కాగితంపై బిల్లులు ఇస్తున్నారు. ఎక్కువ మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు చెల్లించడం లేదు. ఈసారైనా అధికారులు సక్రమంగా పర్యవేక్షించి అనుమతులు, బిల్లులు, నిబంధనలు అమలు పకడ్బందీగా ఉండేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇవి పాటించాలి

- ✦ గ్రామీణ ప్రాంతాల్లో గడ్డి వాములు, పూరిగుడిసెలు ఉంటాయి. అక్కడ రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటివి కాల్చకూడదు. టపాకాయల పనితీరు, వెలిగించాల్సిన విధానం తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలి.
- ✦ పెద్దల పర్యవేక్షణలో పిల్లలతో టపాసులు కాల్పించాలి. రోడ్లపై బాణసంచా పేల్చితే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది.
- ✦ వ్యాపారులు జన సంచారంలేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలి.
- ✦ టపాకాయలు విక్రయించే వ్యాపారులు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందాలి.
- ✦ విక్రయ ప్రాంతంలో విధిగా ఇసుక, నీరు, కార్బన్ డయాక్సైడ్ వాయువును అందుబాటులోఉంచుకోవాలి.
- ✦ దుకాణాల సమీపంలో ఎవరూ సిగిరెట్లు, బీడీలు కాల్చకూడదని బోర్డులు ఏర్పాటు చేయాలి.
- ✦ సెల్‌ఫోన్‌లో మాట్లాడకుండా చర్యలు తీసుకోవాలి. దుకాణాల మధ్య కనీసం పది అడుగుల దూరం ఉండాలి.
- ✦ మందుగుండు సామగ్రి విక్రయించే కేంద్రాల్లో విద్యుత్ వైరింగ్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలి.
- ✦ ప్రతి దుకాణం ఎదుట టపాకాయల ధరల పట్టిక, అగ్ని మాపక కేంద్రాల ఫోన్ నంబర్లు తప్పకుండా ఉండాలి.

అనుమతులు తీసుకోవాలి



టపాకాయలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడైనా అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవు. భద్రాచలంలో 9 దుకాణాలకు అనుమతి జారీ చేశాం.

– శ్రీనివాస్, తహసీల్దార్, భద్రాచలం

సమాచారం ఇవ్వాలి



ప్రమాదాలనేవి ప్రారంభంలో చిన్నవిగానే ఉంటాయి. గమనించగానే అప్రమత్తం కావాలి. అందుబాటులో ఉన్న వనరులతో సాధ్యమైనంత వరకూ ప్రమాద నివారణకు ప్రయత్నించాలి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి లేదా 108 వాహన సిబ్బందికి లేదా పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలి.

– శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి, భద్రాచలం

తయారీలో ప్రాణాంతక రసాయనాలు

బాణాసంచాలో ప్రాణాంతక రసాయన మూలకాలు వినియోగిస్తారని, వాటి వల్ల కేన్సర్, ఊపిరితిత్తులు, చర్మవ్యాధుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రసాయనాలు శరీరంలోని ఏ అవయవంపై ఎలా ప్రభావం చూపుతాయో వివరించారు.

రూ.కోట్లలో వ్యాపారం

జిల్లాలో ఏటా మందుగుండు సామగ్రి వ్యాపారం సుమారు రూ.3 కోట్లకు పైగా సాగుతోంది. అధికారికంగా అనుమతితో తీసుకున్న ప్రాంతాలలో మాత్రమే సామగ్రి విక్రయిస్తుంటారు. కానీ.. అధిక శబ్దాలనిచ్చే టపాసులను కొనేందుకే వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్థానికంగా లభించే వాటికంటే ఇతర రాష్ట్రాల నుంచే అత్యధిక శబ్దాలనిచ్చే టపాసులను తెప్పించి విక్రయాలకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

- **నైట్రిక్ ఆక్సైడ్ :** మందు గుండులో నైట్రిక్ ఆక్సైడ్ వాడడం వల్ల వచ్చే పొగతో ఊపిరితిత్తుల పొరపాడయ్యే ప్రమాదం ఉంది.
- **లిథియం :** ఎరువు రంగు రావడానికి ఇది దోహదపడుతుంది. ఇది విషవాయువు. దీన్ని పీల్చడంవల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురవుతారు. శ్వాస నాళాల్లో అలర్జీ వచ్చే అవకాశం ఉంది.
- **అమ్మోనియం, పొటాషియం :** వీటికి మండించే స్వభావం ఉంటుంది. కంఠనాళంపై ప్రభావం చూపుతాయి. థైరాయిడ్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. విషపూరిత రసాయనం శరీరం అంతటా వ్యాపించి పలు రోగాలకు కారకం అవుతుంది. భూగర్భ, ఉపరితల జలం కలుషితమై వ్యాధులకు కారకం అవుతుంది.
- **ఆర్సె మిశ్రమం:** చర్మంపై దద్దుర్లు పుడతాయి. చర్మవ్యాధికి దారితీసే ప్రమాదం ఉంది. దీన్ని పీల్చడం వల్ల ఊపిరితిత్తుల కేన్సర్ రావచ్చు.
- **నైట్రోజన్ డయాక్సైడ్:** టపాసులు మండించడానికి వినియోగిస్తారు. తీవ్ర విషపూరిత వాయువు వెదజల్లుతుంది. శిశువులపై, పశువులపై తీవ్రప్రభావం చూపుతుంది. ఆమ్ల వర్షాలకు కారకం అవుతుంది.
- **కాపర్ మిశ్రమం:** ఇది నీలి రంగు రావడానికి ఉపయోగపడుతుంది. దీన్ని పీల్చడం వల్ల శరీరంలోని హార్మోన్లు గతి తప్పి పలు శారీరక వ్యాధులు రావడమే కాకుండా విషపూరిత వాయువు శరీరాన్ని ఇబ్బందుల్లోకి నెట్టివేస్తుంది.
- **బేరియం నైట్రేట్:** ఆకుపచ్చ రంగు వచ్చేందుకు దీన్ని వాడుతారు. ఇది విషపూరితం, రేడియోధార్మికత ప్రభావం చూపి ఉదర సంబంధ వ్యాధులు వస్తాయి. చర్మం దెబ్బతిని కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.
- **యాంటీ మోనీసల్ఫైడ్:** మందు గుండు సామగ్రిలో మెరుపులు రావడానికి వినియోగిస్తారు. ఈ రసాయనం పీల్చడం కారణంగా శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తుతాయి. ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. కేన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.
- **కాడ్మియం మిశ్రమం:** ఈ రసాయనాన్ని నిషేధించినప్పటికీ వినియోగిస్తున్నారు. మందుగుండు సామగ్రిలో రకరకాల రంగులు వెదజల్లేందుకు ఉపయోగిస్తారు. దీనివల్ల ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. కేన్సర్ కూడా వచ్చే అవకాశం ఉంది.
- **అల్యూమీనియం:** మందుగుండు సామగ్రి కాంతివంతంగా ప్రకాశించేందుకు ఈ మూలకాన్ని వినియోగిస్తారు. దీనివల్ల వెలువడే పొగ పీల్చడం వలన మెదడుపై ప్రభావం చూపి జ్ఞాపకశక్తిని నశింపచేస్తుంది. ఫలితంగా మతిమరుపు వ్యాధివచ్చే ప్రమాదం ఉంది.

గర్భిణుల సమీపంలో కాల్చొద్దు



టపాసులను గర్భిణులు, శిశువులకు సమీపంలో కాల్చ కూడదు. ఆ సమయంలో వారిని ఇంట్లో సురక్షితమైన ప్రదేశంలో ఉంచాలి. లేదంటే శబ్దం, అనంతరం వెలువడే కలుషిత వాయువులు పీల్చడం వల్ల గర్భిణికి, గర్భస్థ శిశువుకు ప్రమాదం.

– డాక్టర్ మోతీలాల్, చిన్నపిల్లల వైద్యనిపుణుడు, ఇల్లెందు

ఊపిరితిత్తులు దెబ్బతినే అవకాశం



మందుగుండు పేల్చిన తర్వాత వెలువడే విషపూరిత వాయువులను ఎక్కువగా పీల్చడం వల్ల ఊపిరితిత్తులు దెబ్బతినడంతోపాటు శ్వాసకోశ సంబంధ వ్యాధులు వస్తాయి. సాధ్యమైనంత వరకు దూరంగా పెట్టి ఒకట్రెండు క్రాకర్లు, బాంబులు కాల్చడం శ్రేయస్కరం.

– డాక్టర్ కవిత, వైద్యాధికారి, రొంపేడు పీహెచ్‌సీ

28 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, పక్కన మరో ఎమ్మెల్యే కనకయ్య, నాయకులు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కోరం కనకయ్య తెలిపారు. చుంచుపల్లి మండలంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి పొంగులేటి పుట్టిన రోజు సందర్భంగా పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యాన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొంటాయని, ఇందులో ఆరు మహిళా జట్లు ఉంటాయని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని, విజేతలకే కాక ప్రతీ జట్టుకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ చీకటి కార్తీక్, ప్రధాన కార్యదర్శి స్వాతిముత్యం, నాయకులు, ప్రజాప్రతినిధులు కంచర్ల చంద్రశేఖర్ రావు, నాగసీతారాములు, తూము చౌదరి, నాగేంద్రత్రివేది, రాయల శాంతయ్య, జేవీఎస్.చౌదరి, వై శ్రీనివాస్‌రెడ్డి, తలుగు అనిల్, మహమ్మద్ గౌస్, అయూబ్ ఖాన్, జానీ, హైమావతి, వాణిరెడ్డి, రమాదేవి, సుప్రియ పాల్గొన్నారు.

గిరిజనుడికి ఐటీడీఏ ఆర్థికసాయం

వరదల్లో ఆటో కొట్టుకుపోగా ఎమ్మెల్యే చొరవతో చెక్కు పంపిణీ



గిరిజనుడికి రూ.25 వేల చెక్కు అందజేస్తున్న పీఓ రాహుల్, ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం: ఇటీవల గోదావరి వరదల సమయంలో వరదల్లో అశ్వాపురం మండలం గొందిగూడెం గ్రామానికి చెందిన సందీప్ ఆటో ఇసుకవాగులో కొట్టుకుపోయింది. బాధితుడిది గిరిజన నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో సమస్యను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు విన్నవించగా.. ఆయన ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ రాహుల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ.25 వేల చెక్కును సందీప్‌కు అందజేశారు. కాగా గొందిగూడెం గ్రామానికి చెందిన పోడు భూములు సాగుదారులు పాయం మల్లమ్మ, కన్నయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, సుమలత, కనితి రత్తమ్మ, పాయం వీరనారాయణ, కలబొయిన ముత్తయ్యలకు సంబంధించిన పోడు పట్టాలు పెండింగ్‌లో ఉన్నాయి. శనివారం పట్టాలను కూడా పీఓ, ఎమ్మెల్యే గిరిజన రైతులకు అందజేశారు.

12 శాతం రిజర్వేషన్ అందేవరకు పోరాటం

మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

భద్రాచలం అర్బన్ : మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ అందేవరకు పోరాటం కొనసాగిస్తామని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి పేర్కొన్నారు. శనివారం భద్రాచలంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై ముందుకు పోవడం హర్షణీయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ చేయడం ద్వారా 30 ఏళ్ల మాదిగల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించబోతున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో చిత్తశుద్ధిని చాటుకుంటున్న ప్రభుత్వం మాదిగ బిడ్డలకు అన్యాయం జరగకుండా జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలని కోరారు. అంటరానివారిగా తిరోగమనంలో బతకడానికి కారణమైన హిందూ మతవాద బీజేపీకి మాదిగలు ఎప్పటికీ దగ్గర కారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడారి ధీరన్, గద్దం శ్రీరామ్, కొండమీది గోవిందరావు, మట్టే గురుమూర్తి, గద్దల నాగేశ్వరరావు, బెజవాడ శ్రవణ్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, ఆవులూరి సత్యనారాయణ, నక్క శాంత కుమార్, చింత నాగ ముత్యం, నక్క రత్నకుమారి, మల్లీశ్వరి, గద్దం చిట్టెమ్మ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

- ఇల్లెందుకు శ్రీకాంత్, పాల్వంచకు సుజాత నియామకం
- బొగ్గుట్టలో పనిచేస్తున్న యాదగిరి మణుగూరుకు బదిలీ



దాకూ నాయక్



శ్రీకాంత్



యాదగిరి

ఇల్లెందు/పాల్వంచ/మణుగూరుటౌన్: జిల్లాలో ముగ్గురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇల్లెందు కమిషనర్ బి.యాదగిరిని మణుగూరుకు బదిలీ చేయగా, పాల్వంచ కమిషనర్ దాకూనాయక్‌ను బదిలీ చేస్తూ సీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. యాదగిరి స్థానంలో రామగుండం మున్సిపాలిటీలో పనిచేస్తున్న సీహెచ్ శ్రీకాంత్‌ను నియమించారు. ఏడాది కాలంగా ఇల్లెందులో పని చేస్తున్న యాదగిరి హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు బదిలీకి యత్నించినట్లు తెలుస్తుండగా, మణుగూరుకు పంపించారు. కొత్తగా వస్తున్న శ్రీకాంత్ గతంలో పాల్వంచ కమిషనర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే ఇల్లెందు కమిషనర్‌గా రెండు నెలలపాటు అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2019లో నాటి కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ అప్పటి కమిషనర్ సరస్వతిని బదిలీ చేసి, శ్రీకాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక మణుగూరులో రెండున్నరేళ్లుగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావును సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు బదిలీ చేశారు.

మూడు నెలల్లోనే దాకూ నాయక్ బదిలీ..

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సుజాతను పాల్వంచ కమిషనర్‌గా బదిలీ చేశారు. కాగా దాకూ నాయక్ గత ఆగస్టు 5న ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టగా, మూడు నెలల వ్యవధిలోనే బదిలీ కావడం గమనార్హం. ఆయన రాక ముందు నుంచే సుజాత ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మార్పులు జరిగినట్లు తెలుస్తోంది.

నేడు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికకు ఆదివారం పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్ తెలిపా రు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీల్లో ఎంపిక చేయనున్న జట్లు నవంబర్ 8నుంచి ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటా యని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకల్లా హాజరుకావాలని సూచించారు.

పురుగుల మందు డబ్బాతో మహిళా రైతు ఆందోళన



ఆవేదన వ్యక్తం చేస్తున్న రత్తమ్మ

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యం తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఇరవెండి గ్రామానికి చెందిన మహిళా రైతు నూకా రత్తమ్మ పురుగుల మందు డబ్బాతో శనివారం ఆందోళనకు దిగింది. గోదావరి నుంచి ఐటీసీ పీఎస్‌పీడీకి వేస్తున్న పైప్‌లైన్ తమ భూమిలో నుంచి వెళ్తున్నందున తమకు పరిహారం ఇవ్వాలని, ఐటీసీలో తమ కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరింది. గ్రామానికి చెందిన కొందరు నాయకులు తమకు న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నారని, తమను బెదిరించి పైప్‌లైన్ పనులు జరిపించేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం అర్ధరాత్రి తమకు తెలియకుండా పైప్‌లైన్ పనులు చేసేందుకు మిషన్లు తీసుకెళ్లారని, స్థానికుల సమాచారంతో తాము వెళ్లి పైప్‌లైన్ పనులను అడ్డుకున్నామని తెలిపింది. దౌర్జన్యంగా పైప్‌లైన్ పనులు చేయాలని చూస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడతానని, తమ చావుకు కొందరు నాయకులు బాధ్యత వహించాల్సి వస్తుందని ఆమె హెచ్చరించింది. కాగా పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఐటీసీ అధికారులను ఆమెతో మాట్లాడించేందుకు పోలీసులు చర్చలు జరిపినట్లు సమాచారం.

కాన్పు కోసం ఆస్పత్రికి వెళ్లి.. అనంతలోకాలకు..

మృత శిశువు జననం – కాసేపటికే తల్లి మరణం



మృతిచెందిన ఆదివాసీ మహిళ మిడియం మోతీ

ములకలపల్లి : ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన గర్భిణి మృత శిశువు జన్మనివ్వగా.. కాసేపటికే తల్లి సైతం మృతి చెందిన ఘటన ములకలపల్లి మండలం పాతగంగారంలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతగంగారం శివారులోని గొత్తికోయ గుంపునకు చెందిన పొడియం మోతీ (20) గురువారం పురుటి నొప్పులతో బాధపడుతుండగా స్థానిక ఆశా కార్యకర్తలు ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లాక నొప్పులు తగ్గడంతో పాటు ఆరోగ్యం కూడా బాగానే ఉందంటూ వైద్యులు ఇంటికి పంపించారు. శుక్రవారం మళ్లీ నొప్పులు ఎక్కువ కావడంతో తిరిగి పాల్వంచ ఆస్పత్రికి వెళ్లగా సాయంత్రం డాక్టర్లు శస్త్రచికిత్స చేసి మృతశిశువును బయటకు తీశారు. ఆ తర్వాత కాసేపటికే ఆరోగ్యం విషమించి మోతీ కూడా మృతిచెందింది. అయితే వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందిందని మోతీ భర్త దినేష్ ఆరోపిస్తున్నాడు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు. కాగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపారు. పాల్వంచ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్ మాట్లాడుతూ.. మోతీ కార్డియోమయోపతి సంబంధిత వ్యాధితో బాధ పడుతోందని, కాన్పు సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందిందని తెలిపారు. హైరిస్క్ ఉన్నందున వరంగల్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినా, కుటుంబీకులు స్పందించలేదన్నారు.

యూరియా విక్రయాలపై విచారణ

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘంలో యూరియా విక్రయాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై శనివారం ప్రత్యేకాధికారి రాజశేఖర్‌రెడ్డి విచారణ నిర్వహించారు. పీఏసీఎస్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పాలకవర్గం, కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. మూడు నెలల క్రితం జరిగిన యూరియా విక్రయాల అక్రమాలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ప్రాథమిక విచారణలో 547బస్తాల విక్రయాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్న విషయాన్ని గుర్తించామన్నారు. 70బస్తాలకు సంబంధించిన వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదుచేశామని, మిగతా 477బస్తాలు ఎక్కడికి చేరుకున్నాయో విచారణ చేస్తున్నామని వివరించారు. ఈ విషయంలో పాలకవర్గం, కార్యాలయ సిబ్బంది తమకు వాస్తవాలు తెలిపి సహకరించాలని సూచించారు. పనిఒత్తిడి కారణంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని సిబ్బంది వివరణ ఇచ్చినా కూడా తప్పిదమేనని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భద్రాచలంఅర్బన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం భద్రాచలం ఎస్‌ఐ విజయలక్ష్మి పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వసూళ్లలో హిజ్రాల మధ్య ఘర్షణ

నేలకొండపల్లి: నిర్దేశించుకున్న పరిధి దాటి వసూళ్లకు వచ్చారంటూ ఇరువర్గాలకు చెందిన హిజ్రాలు ఘర్షణకు దిగారు. వివరాలు... దీపావళి పండుగ మామూళ్ల వసూలు చేసుకునేందుకు ఖమ్మంకు చెందిన పలువురు హిజ్రాలు శనివారం నేలకొండపల్లికి వచ్చారు. అయితే, వారం రోజులుగా వసూళ్లు చేస్తున్న ఇంకొందరు హిజ్రాలు ఎదురుపడడంతో ఖమ్మం నుంచి ఇక్కడకు రావడమేమిటని ప్రశ్నించే క్రమాన మాటామాట పెరిగి గొడవకు దిగారు. దీంతో అరుపులు, కేకలతో ప్రధాన సెంటర్ దద్దరిల్లింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని వారిని అదుపులోకి తీసుకోగా, 12మందిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై పి.సంతోష్ తెలిపారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ఖమ్మంరూరల్: అనారోగ్య కారణాలతో మండలంలోని తెల్దారుపల్లికి చెందిన వంగూరి చుక్కమ్మ(70) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులతో బాధపడుతున్న ఆమె ఈనెల 25న పురుగుల మందు తాగగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిందని సీఐ ముష్కర రాజు తెలిపారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేగళ్లపాడుకు చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ పనుల్లో భాగంగా ట్రాక్టర్‌తో స్తంభాన్ని ఢీకొట్టడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన సోయం ఉదయ్ కిరణ్(24) ఆయిల్‌పామ్ తోటలో ట్రాక్టర్ రోటవేటర్‌తో శనివారం దుక్కి దున్నుతున్నాడు. ఈక్రమాన ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా స్తంభం విరిగి ట్రాక్టర్‌పై పడడంతో కిరణ్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు తల్లిదండ్రుల ఫిర్యాదుతో సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.



జోహర్ కప్‌లో యువ భారత్‌కు కాంస్య పతకం

సుల్తాన్ జొహర్ కప్ అండర్-21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. మలేసియా వేదికగా శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత జట్టు షూటౌట్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి కాంస్యం ఖాతాలో వేసుకుంది. గోల్‌కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ప్రత్యర్థి మూడు గోల్స్ ప్రయత్నాలను అడ్డుకోవడంతో భారత జట్టు విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు రెండేసి గోల్స్ చేయగా... ఫలితం తేల్చేందుకు నిర్వహించిన షూటౌట్‌లో భారత్ 3-2తో గెలుపొందింది. షూటౌట్‌లో భారత్ తరఫున గుర్‌జోత్ సింగ్, మన్‌మీత్ సింగ్, సౌరభ్ ఆనంద్ గోల్ కొట్టారు. అంతకుముందు భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (11వ నిమిషంలో), మన్‌మీత్ సింగ్ (20వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... న్యూజిలాండ్ తరఫున బ్రౌన్ (51వ ని.లో), జాంటీ ఎల్మ్స్ (57వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆరంభం నుంచి మ్యాచ్‌పై పట్టు కొనసాగించిన భారత జట్టు... చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చింది.

'కివీ' చేతుల్లో ఖేల్ ఖతం!

అనూహ్యం, అసాధారణమేమీ జరగలేదు... న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ తమ వైఫల్యాన్ని కొనసాగించారు...భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలి సిరీస్‌ను అప్పగించేశారు... సొంతగడ్డపై కూడా స్పిన్‌ను ఆడలేని తమ బలహీనతను మళ్లీ ప్రదర్శిస్తూ టీమిండియా తలవంచింది...ఫలితంగా పుష్కర కాలం తర్వాత స్వదేశంలో టెస్టు సిరీస్ చేజారింది... ఒక్క యశస్వి జైస్వాల్ మాత్రమే ధాటిగా ఆడి ఆశలు రేపినా... మిగతావారంతా చేతులెత్తేయడంతో మూడో రోజుకే మ్యాచ్ ముగిసింది... కివీ బౌలర్ సాంట్నర్ మరోసారి తన మాయాజాలం ప్రదర్శిస్తూ ఆరు వికెట్లతో చెలరేగాడు. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడి ఏమాత్రం అంచనాలు, ఆశలు లేకుండా భారత గడ్డపై అడుగుపెట్టిన న్యూజిలాండ్ బృందం అసాధారణ ప్రదర్శనతో ఏకంగా 2-0తో సిరీస్‌నే గెలుచుకోవడం విశేషం. ఇక భారత్ ముందు మిగిలింది చివరి మ్యాచ్‌లో నెగ్గి కాస్త పరువు కాపాడుకోవడమే!


విజయానందంలో న్యూజిలాండ్ ఆటగాళ్లు


సాంట్నర్

రెండో టెస్టులో భారత్ ఓటమి

- 113 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- 2-0తో సిరీస్ సొంతం
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 245 ఆలౌట్
- శుక్రవారం నుంచి చివరి టెస్టు

పుణే: స్వదేశంలో భారత జట్టు అనూహ్య రీతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. శనివారం ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లోనూ నెగ్గిన ఆ జట్టు మరో టెస్టు మిగిలి ఉండగానే సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. 359 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 60.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (65 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధసెంచరీ చేయగా, రవీంద్ర జడేజా (84 బంతుల్లో 42; 2 ఫోర్లు) చివర్లో కాస్త పోరాడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ సాంట్నర్ (6/104) మరోసారి భారత్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/5తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్లన్‌డెల్ (41; 3 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. భారత బౌలర్లలో సుందర్ 4, జడేజా 3 వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

జైస్వాల్ మినహా...

క్రీజ్‌లో జైస్వాల్ ఉన్నంత సేపు భారత జట్టు లక్ష్యంపై గురి పెట్టి దూకుడైన ఆటను ప్రదర్శించేందుకు సిద్ధమైందని అనిపించింది. ఒక వైపు రోహిత్ (8) మళ్లీ విఫలమైనా...మరో ఎండ్‌లో జైస్వాల్ తొలి ఓవర్‌నుంచే బౌండరీలతో చెలరేగాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (23) కూడా కొద్ది సేపు సహకరించాడు. లంచ్ సమయానికి భారత్ 81/1తో మెరుగైన స్థితిలో కనిపించగా... విరామం తర్వాత 41 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే రెండో సెషన్‌లో గిల్‌ను అవుట్ చేసి పతనానికి శ్రీకారం చుట్టిన సాంట్నర్ ఆ తర్వాత జైస్వాల్ వికెట్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. మరో ఐదు బంతులకే పంత్ (0) అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి రనౌట్ కావడం జట్టును మరింత దెబ్బ తీసింది. కోహ్లి పాయింట్ దిశగా ఆడి పరుగు ప్రారంభించగా... పంత్ మరో ఆలోచన లేకుండా దూసుకొచ్చాడు. అయితే అతను డైవ్ చేసినా లాభం లేకపోయింది. కోహ్లి (17)ని సాంట్నర్ ఎల్బీగా దొరకబుచ్చుకోగా, భారత బ్యాటర్ రివ్యూ చేసినా ఫలితం దక్కలేదు. అనంతరం రెండు పరుగుల వ్యవధిలో సర్ఫరాజ్ (9), సుందర్ (21) అవుటయ్యారు. జడేజా, అశ్విన్ (18) కొద్ది సేపు ప్రతిఘటించినా... అదీ ఎక్కువ సేపు సాగలేదు. అంతకు ముందు న్యూజిలాండ్ మూడో రోజు మరో 16.4 ఓవర్లు ఆడి మరో 57 పరుగులు జోడించగలిగింది.

స్కోరు వివరాలు:

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259; **భారత్ తొలి ఇన్నింగ్స్** 156; **న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్:** లాథమ్ (ఎల్బీ) (బి) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) (బి) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; సాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌతీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్)** 255. **వికెట్ల పతనం:** 1-36, 2-78, 3-89, 4-123, 5-183, 6-231, 7-237, 8-238, 9-241, 10-255. **బౌలింగ్:** అశ్విన్ 25-2-97-2, సుందర్ 19-0-56-4, జడేజా 19.4-3-72-3, బుమ్రా 6-1-25-0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) సాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 23; కోహ్లి (ఎల్బీ) (బి) సాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) సాంట్నర్ 9; జడేజా (సి) సౌతీ (బి) పటేల్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 18; ఆకాశ్‌దీప్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (60.2 ఓవర్లలో ఆలౌట్)** 245. **వికెట్ల పతనం:** 1-34, 2-96, 3-127, 4-127, 5-147, 6-165, 7-167, 8-206, 9-229, 10-245. **బౌలింగ్:** సౌతీ 2-0-15-0, రూర్కే 1-0-5-0, సాంట్నర్ 29-2-104-6, ఎజాజ్ 12.2-0-43-2, ఫిలిప్స్ 16-0-60-1.

12 భారత జట్టు స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయింది. 2012లో ఇంగ్లండ్ చేతిలో టీమిండియా 1-2తో ఓడింది.

18 తాజా ఓటమికి ముందు స్వదేశంలో భారత్ వరుసగా గెలిచిన సిరీస్‌ల సంఖ్య.

1 భారత గడ్డపై న్యూజిలాండ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం. గతంలో కివీస్ ఇక్కడ 12 సిరీస్‌లు ఆడగా...10 ఓడి 2 డ్రా చేసుకుంది.

'పరాభవ భారం'

'నాపై ఇక కత్తులు దూయండి'... బెంగళూరు టెస్టులో 46కు ఆలౌట్ అయిన తర్వాత మీడియా సమావేశంలో రోహిత్ శర్మ వ్యాఖ్య ఇది!

'12 ఏళ్ల తర్వాత ఒక సిరీస్ ఓడిపోయాం ...ఈమాత్రం మినహాయింపు ఇవ్వడంలో తప్పు లేదు'...రెండో టెస్టులో ఓటమి అనంతరం అదే కెప్టెన్ చెప్పిన మాట ఇది.



ఇన్నేళ్లుగా తమ ఆటతో విజయాలనే తాము అలవాటు చేశామని, కాబట్టి పరాజయం అందరికీ కొత్తగా అనిపిస్తోందని కూడా రోహిత్ అన్నాడు. అంటే 46 ఆలౌట్‌ను ఒకానొక అరుదైన రోజుగా అంగీకరించిన కెప్టెన్‌కు ఇప్పుడు ఓటమి అలవాటైపోయినట్లుగా అనిపించింది! అయితే ఈ పుష్కర కాలంలో అప్పుడప్పుడు వచ్చిన మ్యాచ్ పరాజయాలకు, తాజాగా సిరీస్ కోల్పోవడానికి మధ్య చాలా తేడా ఉంది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలాంటి టీమ్‌లు భారత్‌ను ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి. మ్యాచ్‌లు గెలిచినా అవి సిరీస్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయాయి. వీటితో పోలిస్తే న్యూజిలాండ్ టెస్టుల్లో అనామక జట్టు కిందే లెక్క. దీనికి ముందు 12 సిరీస్‌లలో కలిపి ఆ టీమ్ ఇక్కడ రెండే మ్యాచ్‌లు గెలవగలిగింది. పైగా ఇటీవలే శ్రీలంక చేతిలో 0-2తో చిత్తుగా ఓడి ఇక్కడకు వచ్చింది. సౌతీ, లాథమ్‌లకు మినహా మిగతావారెవరికీ ఇక్కడ టెస్టులు ఆడిన అనుభవం ఎక్కువగా లేదు. కేన్ విలియమ్సన్‌లాంటి స్టార్ ప్లేయర్ కూడా అందుబాటులో లేడు. అయినా సరే కివీస్ టీమ్ భారత్‌పై పైచేయి సాధించగలిగింది. రెండు పూర్తిగా భిన్నమైన పిచ్‌లపై ఆ జట్టు పైచేయి సాధించిన తీరు టీమిండియా లోపాలను చూపించింది. ముందుగా బెంగళూరు టెస్టులో పేస్ బౌలింగ్ ముందు భారత్ మోకరిల్లి చెత్త రికార్డులను నమోదు చేసింది. దాంతో హడావిడిగా మన బలం స్పిన్ అంటూ పూర్తిగా స్పిన్ పిచ్‌తో సిద్ధమైంది. కానీ ముందు మన బ్యాటర్లు అలాంటి పిచ్‌పై, స్పిన్‌ను సమర్థంగా ఆడగలరా లేదా అనే ఆలోచన రానట్లుంది! అందుకే సాంట్నర్ స్పిన్‌ను కూడా ఎదుర్కోలేకపోయింది. 2017లో ఇదే పుణేలో, ఇదే తరహా పిచ్‌పై ఇలాంటి లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఒ కీఫ్‌కు 12 వికెట్లు అప్పగించి ఆసీస్ చేతిలో భారత్ 333 పరుగులతో చిత్తయింది. ఇప్పుడు కూడా పదునైన స్పిన్‌ను ఆడటం తమ వల్ల కాదని మన బ్యాటర్లు నిరూపించారు. పిచ్‌పై గిర్రున తిరుగుతున్న బంతులకు వారి వద్ద జవాబు లేకపోయింది. బంగ్లాలాంటి బలహీన జట్టుపై దూకుడైన ఆటతో సిరీస్ గెలిచిన వైనంతో మన ప్లేయర్లలో అతి విశ్వాసం పెరిగినట్లు కనిపించింది. పైగా న్యూజిలాండ్ టెస్టుల్లో ప్రభావం చూపలేదనే తేలికపాటి భావం కూడా కావచ్చు! సిరీస్‌లో రోహిత్ విఫలం కాగా, కోహ్లి తన ఆటతో తీవ్రంగా నిరాశపర్చాడు. జైస్వాల్ ఒక్కడే ఆకట్టుకోగా, రెండో ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్ అతని నిర్లక్ష్యాన్ని చూపించింది. సాంట్నర్ చెలరేగిన చోట అదే శైలి బౌలర్ అయిన జడేజాకు తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇదే టీమ్ ఆస్ట్రేలియాకు వెళ్లి గెలుస్తుందనుకోవడం అత్యాశే. మరో వైపు కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ ఓటమిలో పాత్ర ఉంది. బంగ్లాపై సిరీస్ విజయాన్ని గొప్పగా చెప్పుకుంటూ...'ఒక్క రోజులో 400 పరుగులు చేయగల, అవసరమైతే రెండు రోజులు నిలబడి డ్రా చేసుకోగల జట్టుగా మేం మారాలి. నా దృష్టిలో ఆటలో ఎదగడం అంటే అదే' అంటూ వ్యాఖ్య చేశాడు. 400 సంగతేమో కానీ మన బ్యాటింగ్ బలహీనత ఏమిటో ఇది చూపించింది. శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ ఓటమి, 46 ఆలౌట్, 36 ఏళ్ల తర్వాత కివీస్ చేతిలో టెస్టు పరాజయం, ఇప్పుడు తొలిసారి సిరీస్, 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో పరాభవం...ఇవన్నీ కూడా కోచ్ గంభీర్ ఖాతాలో చేరాల్సినవే! ఇకపై మాటలను కట్టిపెట్టి కోచ్‌గా తన బాధ్యతలు సరిగ్గా నెరవేర్చాల్సిన సమయమిది.

–సాక్షి క్రీడావిభాగం

4 రోహిత్ కెప్టెన్సీలో స్వదేశంలో భారత్ ఓడిన టెస్టుల సంఖ్య. గతంలో అజహర్, కపిల్ కెప్టెన్సీలో 4 మ్యాచ్‌లు ఓడగా... పటౌడీ నాయకత్వంలో భారత్ 9 మ్యాచ్‌లు ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● రాజ్‌కుమార్ పెరియసామి, శివ కార్తికేయన్, సాయి పల్లవి, సుధాకర్ రెడ్డి, నాగ్ అశ్విన్

ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతాయి

- దర్శకుడు నాగ్ అశ్విన్

''అమరన్' అద్భుతమైన కథ. రియల్ స్టోరీ తీసినప్పుడు చాలా బాధ్యత ఉంటుంది. ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కమల్‌హాసన్‌గారు ఈ సినిమాని నిర్మించడం గొప్ప విషయం. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. ఈ వేదికపై శివ కార్తికేయన్ మాట్లాడుతూ – ''మేజర్ ముకుంద్ వరదరాజన్, ఇందు రెబెకా బయోపిక్‌గా రూపొందిన చిత్రం 'అమరన్'. ఉద్యోగాన్ని ప్రేమించే కుటుంబం ఎలా ఉంటుందో డైరెక్టర్ రాజకుమార్ అద్భుతంగా చూపించారు. ఈ సినిమాలో నేను మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్ర చేశాను. 'అమరన్' లాంటి చిత్రాన్ని సపోర్ట్ చేస్తే ఇలాంటి రియల్ హీరో స్టోరీస్ ఇంకెన్నో వస్తాయి'' అన్నారు. ''అమరన్' సినిమాతో మీ ముందుకు రావడం గర్వంగా ఉంది'' అని సాయి పల్లవి తెలిపారు. ''దేశవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే సినిమా ఇది. కమల్‌హాసన్ గారి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. ఈ సినిమాని ఇంత పెద్ద స్థాయిలో తెలుగులో రిలీజ్ చేస్తున్న సుధాకర్ రెడ్డి సార్‌కి కృతజ్ఞతలు'' అన్నారు రాజ్‌కుమార్ పెరియసామి. ఈ వేడుకలో నిర్మాత 'ఠాగూర్' మధు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

Gold Memories

మనిషి జీవితానికి ప్రతిబింబం సినిమా. ఎన్నో అద్భుతమైన చిత్రాలు మన మదిలో జ్ఞాపకాలుగా ఉన్నాయి. అవి బంగారు జ్ఞాపకాలు. అందుకే 'సాక్షి యూట్యూబ్' ఇక ప్రతివారం ఓ సినిమాతో మీ మనస్సును తట్టే ప్రయత్నం చేస్తుంది 'గోల్డెన్ మెమొరీస్' రూపంలో. ఈ వారం 'గోల్డెన్ మెమొరీస్'లో ఓ ఆణిముత్యం అయిన 'పెళ్ళిపుస్తకం' గురించి తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే చాలు.

అందమైన ప్రేమకథ


● విహాన్షి, షెరాజ్, నేహా దేశ్ పాండే, భాష్య శ్రీ

షెరాజ్ మెహదీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. హీరోయిన్లు విహాన్షి హెగ్డే, కృతీ వర్మ, నేహా దేశ్ పాండే నటించారు. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ కీలక పాత్రలు పోషించారు. షేర్ సమర్పణలో సైకి ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై సురేందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్, హీరో, మ్యూజిక్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ మాట్లాడుతూ– ''ఓ అందాల రాక్షసి' గ్లామర్ బేస్డ్ మూవీ కాదు. మంచి కంటెంట్ ఉన్న అందమైన ప్రేమకథ. అమాయక మహిళలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారు?. మోసం చేసేవారికి ఎలాంటి శిక్ష ఉంటుంది? అని ఈ మూవీలో చూపిస్తున్నాం'' అని తెలిపారు. ''ఓ అందాల రాక్షసి' సినిమాకు కథ, మాటలు, పాటలు రాశాను'' అని భాష్య శ్రీ చెప్పారు.

యాభైఏళ్ల రాజీనామా

కొణిదెల శివ శంకర వరప్రసాద్.... ఈ పేరు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. హీరో చిరంజీవి అసలు పేరు ఇదే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా శివ శంకర వరప్రసాద్‌గా రంగస్థలంపై 'రాజీనామా' అనే నాటకంతో మొదలైన ఆయన నట ప్రస్థానం యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ ఫొటోను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ''1974లో నర్సాపూర్‌లోని వైఎన్ఎమ్ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పుడు రంగస్థలం మీద నేను వేసిన తొలి నాటకం 'రాజీనామా'. కోన గోవిందరావుగారు రచించారు. నాకు నటుడిగా తొలి గుర్తింపు ఇచ్చింది 'రాజీనామా'. అది కూడా బెస్ట్ యాక్టర్‌గా అవార్డు రావడం ఎనలేని ప్రోత్సాహం ఇచ్చింది. 1974–2024... యాభై సంవత్సరాల నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది'' అంటూ రాసుకొచ్చారు చిరంజీవి. ఇదిలా ఉంటే.. చిరంజీవి నటించిన తొలి చిత్రం 'పునాది రాళ్ళు'. ఈ సినిమాకి గూడపాటి రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో చిరంజీవి నటించిన 'ప్రాణం ఖరీదు' సినిమా మొదట రిలీజ్ అయింది. 'ప్రాణం ఖరీదు' చిత్రం 1978 సెప్టెంబరు 22న విడుదల కాగా 'పునాది రాళ్ళు' 1979 జూన్ 21న రిలీజ్ అయింది. కాగా ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు.


● చిరంజీవి

Mr. K. S. S. V. Prasada Rao, II B. Com.,
Best actor of the college 1974–75.

ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు

- కిరణ్ అబ్బవరం


● నయన్ సారిక, కిరణ్ అబ్బవరం, తన్వీ రామ్

'క' కథ విన్నప్పుడు ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకులకు చూపించాలనిపించింది. ఈ సినిమా క్లైమాక్స్ చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతారు. 'క' సినిమాలోని ఏదైనా ఎలిమెంట్‌ను గతంలో స్క్రీన్‌పై చూశామని మీకు (ఆడియన్స్) అనిపిస్తే నేను సినిమాలు చేయడం మానేస్తా'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. సుజీత్–సందీప్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ మూవీ 'క'. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ నెల 31న ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – 'క'లో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్‌గా కనిపిస్తాను. తోటి వారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని వాళ్ల ఉత్తరాలు చదువుతుంటాడు వాసుదేవ్. ఈ క్రమంలో అతని జీవితం ఎలా టర్న్ తీసుకుంది? అన్నది కథాంశం. వాసుదేవ్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. మా సినిమాను కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నాం... థియేటర్స్ దొరకలేదు. ప్రస్తుతం తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. వారం తర్వాత మిగతా భాషల్లో రిలీజ్ చేసే ప్రయత్నం చేస్తాం'' అన్నారు. ''సినిమా ఆరంభం కాగానే ఆడియన్స్ 'క' ప్రపంచంలోకి వెళ్తారు'' అన్నారు సందీప్. ''క'కు ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది'' అని చెప్పారు వంశీ నందిపాటి.



రీతూ వర్మ మజాకా

హీరో సందీప్ కిషన్‌తో కలిసి మజాకా చేస్తున్నారు హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్, రీతూ వర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మజాకా'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. కాగా 'మజాకా' సినిమాలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా వెల్లడించి, వైజాగ్ సెట్స్‌లో రీతూ వర్మ జాయిన్ అయినట్లుగా చిత్రయూనిట్ శనివారం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలుస్తోంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

కేజీఎఫ్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది

- దర్శకుడు సూరి



శ్రీ మురళి హీరోగా డా. సూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బఘీర'. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31 విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు డా. సూరి మాట్లాడుతూ– ''ప్రశాంత్ నీల్‌గారి 'కేజీఎఫ్, సలార్' చిత్రాల రైటింగ్ విభాగంలో నేనూ ఉన్నాను. శ్రీ మురళిగారితో నేను ఒక సినిమా చేద్దామనుకున్నప్పుడు కథ కుదర్లేదు. అప్పుడు తన దగ్గర కథ ఉందని ప్రశాంత్ నీల్‌గారు చెప్పడంతో 'బఘీర' చిత్రం ప్రారంభమైంది. సూపర్ హీరో అవ్వాలనుకున్న ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. ఈ సినిమా అవుట్‌పుట్ చూసి ప్రశాంత్ నీల్‌గారు హ్యాపీ ఫీలయ్యారు. శ్రీ మురళి బాగా నటించారు. 'బఘీర'ను 'కేజీఎఫ్'తో పోల్చి మాట్లాడుతున్నారు. 'బఘీర' సినిమా 'కేజీఎఫ్' టోన్‌లో ఉండదు. 'కేజీఎఫ్' చరిత్రలాంటి సినిమా. ఈ సినిమాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''పన్నెండేళ్ల క్రితం యశ్‌తో ఓ సినిమా చేశాను ('లక్కీ'). ఆ తర్వాత యశ్‌తో ట్రావెల్ అయ్యాను. యశ్ కథలను నేనే వినేవాడిని. అయితే యశ్‌తో నేను అనుకున్న సినిమా వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత 'కేజీఎఫ్' వల్ల యశ్‌కు చాలా సమయం పట్టింది. దీంతో నేను శ్రీ మురళితో 'బఘీర' చేశాను'' అని తెలిపారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఈ కలయిక కాస్త ఘాటు గురూ...

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ది యూనియన్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎక్కడైనా ప్రేమికులు చాలా ఏళ్ల తరువాత కలిస్తే, చాలా హాట్ హాట్‌గా ఉంటుంది. కానీ ఈ 'ది యూనియన్' సినిమాలో పాత ప్రేమికులు కలిసిన తరువాత ఇంత ఘాటా అని చూసే ప్రేక్షకుడు నోరెళ్లబెట్టాల్సిందే. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. జూలియన్ ఫరియానో దర్శకత్వం వహించిన స్పై కామెడీ థ్రిల్లర్ సినిమా 'ది యూనియన్'. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో తెలుగులోనూ ఈ సినిమాని చూడవచ్చు. హేమాహేమీలైన హాలీబెర్రీ, మార్క్ వాబర్గ్, మైక్ కాల్టర్ నటించిన ఈ సినిమా పెద్దలకు మాత్రమే. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... కథానాయకుడు మైక్ మెకన్నా న్యూజెర్సీ నగరంలో ఓ సాధారణ బిల్డింగ్ కార్మికుడు. రోజువారీ కష్టంతో తన పనేదో తాను చూసుకుపోయే మనస్తత్వం గలవాడు. కాకపోతే కాస్తంత అమ్మాయిల పట్ల పిచ్చి ఎక్కువ. హాయిగా సాగుతున్న మైక్ జీవితంలో అనుకోని ఓ అవాంతరం తన హైస్కూల్ క్రష్ అయిన రోక్సేన్ హాల్ ద్వారా ఎదురవుతుంది. 25 ఏళ్ల తరువాత కలిసిన తన ప్రేమను గుర్తు చేసుకుంటూ డాన్స్ చేస్తూ స్పృహ తప్పుతాడు మైక్. అలా న్యూజెర్సీలో స్పృహ తప్పిన మైక్ తిరిగి కళ్లు తెరిచేసరికి లండన్‌లో ఉంటాడు. మరోపక్క ఓ బ్రీఫ్‌కేస్ కోసం ఇరాన్ తీవ్రవాదులు, నార్త్ కొరియా ఏజెంట్లు, రష్యన్ గూఢచారులు తెగ వెతికేస్తుంటారు. ఆ బ్రీఫ్‌కేస్‌లో చాలా సెన్సిటివ్ ఇన్ఫర్మేషన్ ఉంటుంది. దాని కోసం యూనియన్ అనే సంస్థ తమ ప్రతినిధులను చాలా మందినే పోగొట్టుకుంటుంది. అసలు ఆ బ్రీఫ్‌కేస్‌కి, కథానాయకుడు మైక్‌కి సంబంధం ఏంటి? 25 ఏళ్ల తరువాత మైక్ ప్రియురాలు రోక్సేన్ హేల్ అతన్ని ఎందుకు కలిసింది? కలిసిన తరువాత అతను లండన్‌లో ఉండడం ఏంటి? అయినా ఓ ప్రేమికుల కలయికలో ఇంత ఘాటైన ట్విస్టులా? వీటి సమాధానాల కోసం 'ది యూనియన్' సినిమా చూడాల్సిందే. ఈ సినిమా ప్రేక్షకుడిని గిలిగింతలు పెడుతూ ఆద్యంతం థ్రిల్లింగ్ కలిగిస్తుందనడంలో సందేహం లేదు. వీకెండ్ మస్ట్ వాచ్ మూవీ 'ది యూనియన్'.

– ఇంటూరు హరికృష్ణ